aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
గురువారం
5-02-2026 సంపుటి : 01 సంచిక : 11 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738
Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQATI
besqati.com
Contact : info@besqati.com



## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము
- కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం

**న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ

-మిగతా 3 లో


## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే
# గెలిపించండి

**సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి**

- మున్సిపల్ ఎన్నికల తరవాత రైతు భరోసా
- రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం
- తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్
- తెలంగాణ తల్లి మన సోనియమ్మ
- మిర్యాలగూడ ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి

**మిర్యాలగూడ, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి.

-మిగతా 3 లో







## ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

- ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు
- నిజాం నిరంకుశంపై అంకుశం దింపిన గడ్డ
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సిఎం రేవంత్
- మహబూబ్‌నగర్ ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్

**మహబూబ్‌నగర్, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు

-మిగతా 3 లో




## ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

- నరవణె పుస్తకంపై భయపడుతున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వివరాలను పార్లమెంటు ముందుంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో బుధవారం కూడా లోక్‌సభ ప్రారంభం అవ్వగానే ప్రతిపక్ష సభ్యులు ఈ ఒప్పందాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాలతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోడీ మాట్లాడనున్నారు. ఇకపోతే భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం

-మిగతా 3 లో



## మరణశాసనం రాసిన కొరియన్ గేమ్

- ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ఆత్మహత్య
- యూపిలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం

**లక్నో, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
ఉత్తర ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల

-మిగతా 3 లో

## తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట


**సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్**



- అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం
- ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం
- మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీ కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

-మిగతా 3 లో



## పాక్ ఆర్మీకంటే బలూచ్ రెబల్స్ దగ్గరే గొప్ప ఆయుధాలు..

- బలూచ్ ప్రాంతంలో పాకిస్తాన్ ఆర్మీ క్రమంగా పట్టుకోల్పోతోంది
- "బలూచ్ రెబల్స్ వద్ద 2 మిలియన్ డాలర్ల విలువైన రైఫిల్స్ ఉన్నాయి.
- ఈ సంస్థకు ఇండియాతో సంబంధం ఉంది
- బెలూచ్ రెబల్స్ దాడులు ఆపకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయి
- పాక్ రక్షణ మంత్రి వెల్లడి

**న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
పాకిస్తాన్ సైన్యంకంటే బలూచ్ రెబల్స్ దగ్గరే ఆధునిక, ప్రభావవంతమైన ఆయుధాలున్నాయని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. బలూచ్ ప్రాంతంలో పాకిస్తాన్ ఆర్మీ క్రమంగా పట్టుకోల్పోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై మంగళవారం ఆసిఫ్ మాట్లాడారు. అక్కడి పరిస్థితుల్ని వివరించారు. "బలూచ్ రెబల్స్ వద్ద 2 మిలియన్ డాలర్ల విలువైన రైఫిల్స్ ఉన్నాయి. అవి పాక్ సైన్యం వద్ద కూడా లేవు.ఒక్కోటి రూ.4.5 లక్షల విలువగల థర్మల్ వెపన్స్ కూడా వారివద్ద ఉన్నాయి. కొన్ని అమెరికన్ ఆయుధాలు కూడా కలిగి ఉన్నారు. ఒక్కొక్కరి దగ్గర 20 వేల డాలర్ల విలువైన గేర్ ఉంది. ఇలాంటి ఆయుధాలు వారికి ఎక్కడినుంచి వస్తున్నాయి..? ఇలాంటి ఉగ్రవాద సంస్థల నాయకులు ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నారు. క్రిమినల్స్‌తో సంబంధాలున్న వారితో మేం చర్చలు జరపబోం. బీఎల్ఏ పేరు మీద దాడులు జరుగుతున్నాయి. ఈ సంస్థకు ఇండియాతో సంబంధం ఉంది. బెలూచ్ రెబల్స్ దాడులు ఆపకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయి" అని ఖవాజా హెచ్చరించారు. పాకిస్తాన్ సైన్యానికి, బలూచిస్తాన్ తిరుగుబాటుదారులకు మధ్య కొన్నేళ్లుగా యుద్ధం నడుస్తున్న సంగతి తెలిసిందే. గత నెల 31న పాక్ ఆర్మీకి, బలూచ్ రెబల్స్‌కు మధ్య భీకర యుద్ధం జరిగింది. పాక్ భద్రతా దళాలపై బీఎల్ఏ

-మిగతా 3 లో



## క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

- ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి
- అవగాహన కోసం షారట్ ఫలిమ్స్ తీస్తా
- క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి

**హైదరాబాద్ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు. శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే

-మిగతా 3 లో

## వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

- ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి బండి సంజయ్
- పోలీసులు నిష్పక్షపాతంగా ఉండాలని హితవు

**వేములవాడ, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్, భారాసకు ఎందుకు ఓట్లేయాలి?కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ పాల్గొన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా?

-మిగతా 3 లో



## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

- తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు



**హైదరాబాద్, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు' అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని

-మిగతా 3 లో

నమస్తే మహాప్రభ

# సర్' వల్ల 150 మంది మరణించారు..


## సుప్రీం చీఫ్ జస్టిస్‌కు మమతా బెనర్జీ ఫిర్యాదు



**న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన 'సర్' వల్ల 150 మంది తమ రాష్ట్ర ప్రజలు ప్రాణాలు కోల్పోయారని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు ఫిర్యాదు చేశారు. సర్ విషయంలో ఫిర్యాదు చేసేందుకు మమతా బెనర్జీ మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉన్నారు. సోమవారం సీఈసీని కలవగా.. బుధవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిశారు. ఈ అంశంపై వివరించేందుకు సమయం కావాలని మమత.. సీజేఐని కోరారు. ఆయన మమతకు 15 నిమిషాల సమయం ఇచ్చారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో సర్ వల్ల కలుగుతున్న ఇబ్బందుల్ని వివరించారు. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో ఉన్న పిటిషన్లను కూడా త్వరగా విచారించాలని కోరారు. అనంతరం మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడారు. సీఈసీ, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సర్ ఒత్తిడి తట్టుకోలేక పశ్చిమ బెంగాల్‌లో 150 మంది మరణించినట్లు చెప్పారు. వీరిలో ఒక ఎన్నికల అధికారి కూడా ఉన్నట్లు తెలిపారు. మమత మాట్లాడుతూ "పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే సర్ ఎందుకు..? అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాలు కనిపించడం లేదా..? ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంపై మాత్రమే బుల్డోజర్ ప్రయోగిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో అనుమతించిన పత్రాల్ని బెంగాల్‌లో అంగీకరించడం లేదు. ఈ అంశంలో కోర్టులు జోక్యం చేసుకుని, మా రాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించాలి. ప్రజాస్వామ్య హక్కుల్ని కాపాడాలి. నాలుగు గోడల మధ్య న్యాయం ఏడుస్తోంది. మాకు ఎక్కడా న్యాయం జరగడం లేదు. ఎన్నికల సంఘానికి ఇప్పటికి ఆరుసార్లు లేఖలు రాసాం. కానీ, ఒక్కసారి కూడా సరైన సమాధానం రాలేదు" అని అన్నారు. ఈ అంశంపై ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 'సర్'ను నోబెల్ అవార్డ్ గ్రహీత అమర్త్య సేన్, బెంగాల్ కవి జోయ్ గోస్వామి వంటి ప్రముఖులు కూడా వ్యతిరేకించారు.

# జమ్మూలో ఎన్‌కౌంటర్..

## ఇద్దరు ఉగ్రవాదులు హతం



**న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
జమ్మూలోని ఉధంపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతమయ్యారు. జమ్మూ కాశ్మీర్, ఉధంపూర్ జిల్లా, బంసంత్‌ఘుర్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. కాల్పుల్లో జైషే మహ్మద్ అనే తీవ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్ మావి అలియాస్ మావియా మరణించినట్లు పోలీసులు తెలిపారు. జమ్మూ కాశ్మీర్ పోలీసులతోపాటు, ఇండియన్ ఆర్మీ, సీఆర్పీఎఫ్ జవాన్లు కలిసి సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో తీవ్రవాదులు ఉన్నట్లు గతంలోనే పోలీసులకు సమచారం అందింది. తాజాగా తీవ్రవాదులకు సంబంధించిన మరింత కీలక సమాచారం ఇంటెలిజెన్స్ ద్వారా జమ్మూ పోలీసులకు అందింది. దీంతో మంగళవారం నుంచి అక్కడ పోలీసులు, ఆర్మీ, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టి కార్డన్ సెర్చ్ నిర్వహించాయి. ఈ క్రమంలో తీవ్రవాదులు, భద్రతా సిబ్బందికి మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇందులో ఒకడు మావి కాగా, మరొకడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఇంకా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. తీవ్రవాదులు ఇక్కడి అటవీ ప్రాంతంలోని ఒక గుహలో తలదాచుకున్నట్లు సమాచారం అందింది. దీంతో ఈ గుహను పోలీసులు పేల్చేసినట్లు తెలుస్తోంది. దీనిపై మరింత సమాచారం రావాల్సి ఉంది. పోలీసులు, భద్రతా సిబ్బంది సమన్వయంతోనే తీవ్రవాదుల ఎన్‌కౌంటర్ సాధ్యమైందని ఆర్మీ వర్గాలు తెలిపాయి.

# మణిపూర్ కొత్త సీఎంగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణం..

## రాష్ట్రపతి పాలన ఎత్తివేత



**ఇంఫాల్ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
జాతుల వైరంతో అల్లాడిపోయిన మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన తొలగిపోయింది. కొత్త సీఎంగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రులుగా నెమ్చా కిప్‌జెన్, లోసియి దిఖో, హోంమంత్రి గోవిందాస్ కొంతౌజమ్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ¶బఎఋఎ ఖష్ట్రవఎఎ్తుఘఅన ాఆఅస్త్రష్ట) మణిపూర్‌లో అభివృద్ధిని తీసుకురావడానికి బీజేపీ జాతీయ నాయకత్వం తనకు పెద్ద బాధ్యత అప్పగించిందని సీఎం యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ తెలిపారు. తమ కొత్త ప్రభుత్వం అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేరుస్తుందని చెప్పారు. 61 ఏళ్ల యుమ్నం ఖేమ్‌చంద్ మైతీ వర్గానికి చెందినవారు. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులైన నెమ్చా కిప్‌జెన్ కుకీ, లోసియి దిఖో నాగా తెగలకు చెందినవారు. కాగా, మెజారిటీ మైతీ వర్గానికి ఎస్టీ హోదాను బీజేపీ ప్రభుత్వం కల్పించడాన్ని మైనారిటీలైన కుకీ, ఇతర తెగలు వ్యతిరేకించాయి. దీంతో మణిపూర్‌లో అల్లర్లు చెలరేగాయి. ఏడాదిపైగా కొనసాగిన హింసలో వందలాది మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రులయ్యారు. మరోవైపు మైతీ వర్గానికి చెందిన నాటి సీఎం ఎన్ బీరెన్ సింగ్ కుకీలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు వీడియో వైరల్ అయ్యింది. ఈ పరిణామాల నేపథ్యంలో 2025 ఫిబ్రవరిలో సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. ఏడాది తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో బుధవారం ఉదయం రాష్ట్రపతి పాలనను కేంద్రం ఎత్తివేసింది.

# సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

-మే 24న ప్రిలిమ్స్
-ఆగస్టు 21 నుంచి మెయిన్స్

**న్యూఢిల్లీ, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
సివిల్ సర్వీసెస్ పరీక్ష(సీఎస్‌ఈ), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) పరీక్ష, 2026 కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులై, ఆసక్తిగల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిబ్రవరి 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని యూపీఎస్సీ తెలిపింది. సివిల్ సర్వీసెస్ పరీక్ష ద్వారా 933 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నది. ప్రిలిమినరీ పరీక్ష 2026 మే 24న జరుగుతుంది. మెయిన్ పరీక్ష 2026 ఆగస్టు 21న ప్రారంభమవుతుందని నోటిఫికేషన్ పేర్కొన్నది.

# మరణశిక్షల కేసుల్లో ఆచితూచి!

## 8% మరణ శిక్షలను మాత్రమే సమర్థించిన హైకోర్టులు



**న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
మరణ శిక్షల కేసుల్లో ఎడాపెడా శిక్షలు విధించకుండా ఉన్నత న్యాయస్థానాలు ఆచితూచి అడుగేస్తున్నాయి. గత పదేండ్ల మరణ శిక్షల డాటాను విశ్లేషించగా, ఇటీవలి కాలంలో హైకోర్టు ఏ మరణ శిక్షనూ ధ్రువీకరించ లేదు. హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీకి చెందిన క్రిమినల్ లా అడ్వకేసీ గ్రూప్ అయిన స్కేర్ క్లినిక్ చేసిన అధ్యయనం ప్రకారం వివిధ కేసుల్లో అధిక సంఖ్యలో దోషులకు మరణ శిక్షలు కింది కోర్టులు విధించినా అవి హైకోర్టు స్థాయిలో నిలబడ లేదు. ఈ నివేదిక ప్రకారం 2016-25 మధ్య దేశవ్యాప్తంగా ట్రయల్ కోర్టులు 822 కేసుల్లో 1,310 మందికి మరణ శిక్ష విధించాయి. అయితే 8 శాతం మరణశిక్షలను మాత్రమే హైకోర్టులు ధ్రువీకరించాయి. హైకోర్టులు ధ్రువీకరించిన 70 మరణ శిక్షల్లో, 38 సుప్రీం కోర్టు తీర్పులు ఇచ్చి ఒక్క దానిని కూడా సమర్థించలేదు.

# కోల్‌కతాలో ఎమర్జెన్సీ ల్యాండ్ అయిన టర్కీ విమానం




**న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
టర్కీకి చెందిన విమానం కోల్‌కతాలో ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. నేపాల్ రాజధాని ఖాట్మాండ్ నుంచి ఇస్తాంబుల్ (టర్కీ) వెళ్తున్న విమానాన్ని బుధవారం మధ్యాహ్నం కోల్‌కతాలో ల్యాండ్ చేయాల్సి వచ్చింది. టీహెచ్‌వై 727 అనే విమానం బుధవారం మధ్యాహ్నం 01.28 గంటలకు ఖాట్మాండ్‌లోని త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరింది. విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే కుడివైపు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గుర్తించిన పైలట్లు వెంటనే ఎయిర్ పోర్టు సిబ్బందికి సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో దాదాపు పది నిమిషాలు ఆ విమానం అలాగే గాల్లోనే ఎగిరింది. దీంతో అధికారుల సూచన మేరకు విమానాన్ని తిరిగి త్రిభువన్ ఎయిర్ పోర్టుకు రప్పించారు. అక్కడ ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. దాదాపు 15 నిమిషాలపాటు ఎయిర్ పోర్టు మూసేశారు. అనంతరం తిరిగి విమానం కోల్‌కతాలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయాలని నిర్ణయించారు. తిరిగి అక్కడి నుంచి బయల్దేరిన విమానం 02.49 గంటలకు కోల్‌కతాలోని సుభాష్ చంద్రబోస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రస్తుతం అక్కడ విమానానికి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ ఘటన సమయంలో విమానంలో మొత్తం 236 మంది ఉన్నారు. వీరిలో 225 మంది ప్రయాణికులు కాగా.. 11 మంది సిబ్బంది. భారత ఎయిర్‌పోర్ట్ అధికారులు అక్కడి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# రాహుల్ గాంధీ -- రవ్‌నీత్ బిట్టుల మధ్య మాటల యుద్ధం



**న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
పార్లమెంటు ఆవరణలో రాహుల్‌గాంధీ- కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ బిట్టుల మధ్య మాటల యుద్ధం జరిగింది. రాహుల్ రవ్‌నీత్‌ని ద్రోహి అంటే.. రవ్‌నీత్ దేశ్‌కా దుష్మన్ అని వ్యాఖ్యానించారు. యూరోపియన్ యూనియన్, అమెరికాతో భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాలపై పార్లమెంటులో చర్చకు పెట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు బుధవారం పార్లమెంటు మకర ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రవ్‌నీత్ బిట్టు ఎంపీలు నిరసన వైపుగా వచ్చారు. ఆ సమయంలో రాహుల్ రవ్‌నీత్ బిట్టుతో 'హలో బ్రదర్, నా దేశ ద్రోహి మిత్రమా.. మీరేమీ చింతించకండి.. మీరు తిరిగి (కాంగ్రెస్‌లోకి) వస్తారు అని అంటూ కరచాలనం చేయడానికి చేయనందించారు. అయితే రవ్‌నీత్ బిట్టు రాహుల్ చేయి అందుకోవడానికి తిరస్కరించారు. రాహుల్ మాటలకు స్పందనగా.. రవనీత్ బిట్టు రాహుల్‌ని దేశ్ కే దుష్మన్ (రాష్ట్రానికి శత్రువు) అని అన్నారు. పైగా నిరసన చేస్తున్న ఎంపీలను ఆయన ఎగతాళి చేశారు. నిరసన చేస్తున్న ఎంపీలనుదేద్దశించి 'వారు యుద్ధంలో గెలిచినట్లుగా కూర్చున్నారు' అని హేళన చేశారు. కాగా, రవ్‌నీత్ బిట్టు 2024లో కాంగ్రెస్‌ని వదిలి బిజెపిలోకి చేరారు.

# నికోలస్ మదురోను విడుదల చేయాలి

## రష్యా పౌరుల నిరసన




**మాస్కో న్యూఢిల్లీ -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
జూన్ 3వ తేదీన అమెరికా సైన్యం వెనిజులా అధ్యక్షుడు మదురోను, తన భార్య సిలియా ఫ్లోర్స్‌ను కిడ్నాప్ చేశారు. నెలరోజులు గడిచినా మదురోను, ఆయన భార్యను అమెరికా విడుదల చేయలేదు. వీరిని వెంటనే విడుదల రష్యా పౌరులు డిమాండ్ చేశారు. మంగళవారం మాస్కోలో వెనిజులా రాయబార కార్యాలయం సమీపంలో నిరసన చేపట్టారు. వెనిజులాపై చేసి దాడిని వారు తీవ్రంగా ఖండించారు. రష్యా కమ్యూనిస్టు పార్టీ సహకారంతో వెనిజులాకు సంఘీభావం తెలుపుతూ ఈ కార్యక్రమం జరిగింది.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

మొదటి తరువాయి

రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు.

## ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

మొదటి తరువాయి

దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిపోతుందని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయ కుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తార న్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు. ఒకవేళ మోదీ వస్తే.. తానే స్వయంగా ఆయన వద్దకువెళ్లి ఈ పుస్తకాన్ని అందజేస్తానన్నారు.

## మరణశాసనం రాసిన కొరియన్ గేమ్

మొదటి తరువాయి

నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గురూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷-లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మాస్ సూసైడ్స్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కాచెలలెళ్ల గదిలోకి వెళ్లి పరిశీలించగా అక్కడ సూసైడ్ నోట్ దొరికింది. ఆ సూసైడ్ నోట్‌లో వారు తమ బాధనంతా వివరంగా రాసుకొచ్చారు. తల్లిదండ్రులకు క్షమాపణ సైతం చెప్పారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఏం తేలిదంటే.. ప్రాచీ విపరీతంగా మొబైల్ ఫోన్ వాడేది. ఆమె కారణంగానే మిగిలిన ఇద్దరూ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. చివరకు గేమ్ అడిక్షన్ కారణంగానే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

## పాక్ ఆర్మీకంటే బలూచ్ రెబల్స్ దగ్గరే గొప్ప ఆయుధాలు..

మొదటి తరువాయి

భీకర మెరుపు దాడులు చేసింది. ఆత్మాహుతి దాడులకూ పాల్పడింది. దీంతో పాక్ ఆర్మీ కూడా స్పందించింది. ఈ ఘర్షణలో ఇరువైపులా ప్రాణాలు కోల్పోయారు. 100 మందికిపైగా పాక్ భద్రతా సిబ్బంది మరణించగా, 170 మంది వరకు బలూచ్ రెబల్స్ మరణించినట్లు తెలుస్తోంది. ఇరాన్, ఆఫ్ఘన్ సరిహద్దులో ఉండే ప్రాంతం బలూచ్. ఈ ప్రాంతాన్ని 1948లో పాక్‌లో కలిపారు. ఆ తర్వాత నుంచి బలూచ్ రెబల్ గ్రూప్స్‌కు, పాక్ ఆర్మీకి మధ్య నిత్యం ఘర్షణ జరుగుతూనే ఉంది. పాక్ నుంచి స్వాతంత్రం కావాలని రెబల్స్ పోరాడుతున్నారు. బలూచ్ ప్రాంతంలో అత్యధిక విలువైన ఖనిజ వనరులు ఉండటం.. వీటిపై పాక్ కన్నేయడమే ఇందుకు కారణం.

## క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

మొదటి తరువాయి

గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.

## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

మొదటి తరువాయి



అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

మొదటి తరువాయి



ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్ల దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్-ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్ధిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ఘాఒఃఅ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఘాఒఃఅ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.

## ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

మొదటి తరువాయి

ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు. నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ.5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం' అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు. అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అందరి ఫోన్లు ట్యాపింగ్ చేసి పౌరహక్కులు కాలరాసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బీజేపీ కార్యాలయంలో క్లర్క్ ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారంటూ విమర్శించారు. సిట్ నోటీసులు టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ దురహంకారం పెరిగిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గెలిస్తే మాత్రం ట్యాక్స్‌లు పెరుగుతాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే మాత్రం.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తీరాలని కేడర్‌కు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

మొదటి తరువాయి

సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీ హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

మొదటి తరువాయి



నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమీషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని అన్నారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

## సంపాదకీయం

# గాడితప్పుతున్న పార్లమెంట్ సమావేశాలు !



పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృధా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టటం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్దతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది. కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్ధతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్‌పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుం టోంది. అయితే దీనికి కొన్ని రూల్స్ ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷–కే చెల్లింది. అమెరికా –భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపోస్షల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్‌నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్‌తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదిరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే– వద్దని అడ్డం పడ్డాది. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండాలో, కూడదో అదే నిర్దేశించాలని చూశారు. . ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవొంచకూడదని నిర్ణయించి, ఇంతకాలం ట్రేడ్ డీల్‌ను పక్కన పెట్టింది. పాకిస్తాన్–ఇండియా యుద్దాన్ని తానే ఆపానని ట్రంప్ అనేకసార్లు ప్రకటించుకున్నా, భారత్‌పై సుంకాలను భారీగా విధించినా, అక్రమ వలసల పేరిట భారతీయులకు సంకెళ్లు వేసి, దేశంలో దించిపోయినా– భారత్ ఓపిక పట్టింది. ఇప్పుడు కూడా ట్రంప్ ప్రకటించేదాకా ఒప్పందంపై మనం ముందుకు రాలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక– తన దారిలోకి రాని దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించటం ఒక వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలిగించారు. అయితే ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదురవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో సమాధానం చెప్పాయి. నీకు మేమంత దూరమో మాకు నువ్వూ అంతే దూరం అనిసమాధానం ఇచ్చాయి. భారత్ కూడా అదే పద్దతిని అవలంబించింది. మోడీ ప్రభుత్వం ఏ మాత్రం లొంగుబాటుకు ఒప్పుకోలేదు. మనపట్ల అమెరికాలోనే సానుకూలత వ్యక్తం అయ్యింది. అమెరికాలో ఒత్తిడి తట్టుకోలేక ట్రంప్ భారత్‌తో ఓ రకంగా కాళ్ళ బేరానికి వచ్చాడని చెప్పుకోవాలి. అంతేగానీ భారత్ పరువు పోయిందని, మోడీ లొంగిపోయాడని విమర్శించే వారికి అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవను కోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ముందున్నారు. ట్రంప్ బెదిరింపులకు లొగివుంటే ఎప్పుడో ఒప్పందం ఖరారు అయ్యేది. అయితే ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాదని ఎవరూ అనడం లేదు. పార్లమెంటులో చర్చకు ముందే గలాభా సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ పైత్యాన్ని చాటుకుంది. మోడీ ప్రకటన చేసే వరకు ఆగాలి. తాము కోరుకున్నట్లు ఇప్పుడే..ఈ క్షణమే చర్చ జరగాలని అనుకోవడం దుర్మార్గం తప్ప మరోటి కాదు.

పార్లమెంటులో సమస్యలపై చర్చించకుండా, జారుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి.

# హర్యానాలో వైఫై, సిమ్‌లు లేవని.. ట్యాబ్‌లు వెనక్కి తీసుకుంటున్న ప్రభుత్వ స్కూళ్లు


**చండీఘడ్:–04 ఫిబ్రవరి (మహాప్రభ)**
హర్యానా సర్కారు అత్యంత ఆర్భాటంగా ఈ–అధిగమ్ స్కీమ్‌ను ప్రారంభించింది. డిజిటల్ లెర్నింగ్ లో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో ఉచిత ట్యాబ్‌లను పంచారు. కానీ ఆ స్కీమ్ విఫలమైనట్లు తెలుస్తోంది. కర్నాల్, కతియాల్ జిల్లాల్లో అనేక ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థుల నుంచి ఆ ట్యాబ్లెట్లను వెనక్కి తీసుకుంటున్నారు. వైఫై కనెక్టివిటీ , సిమ్ కార్డులు లేకపోవడం, సాంకేతిక సమస్యలు, ఆపరేషనల్ సపోర్ట్ లేకపోవడంతో ట్యాబ్లెట్లను ప్రభుత్వం మళ్లీ తీసేసుకుంటున్నట్లు తెలుస్తోంది.ఆ రాష్ట్ర విద్యాశాఖ ఆ ప్రాజెక్టును ప్రవేశపెట్టింది. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులు డిజిటల్ అంశాల్లో చురుకుగా మారేందుకు ఆ



స్కీమ్‌ను అమలు చేశారు. 2022లో సీఎం మనోహర్ లాల్ ఖట్టార్ ఆ స్కీమ్‌ను ప్రారంభించారు. ఆ స్కీమ్ కింద రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు. ప్రీలోడ్ డిజిటల్ కాంటెంట్‌తో పాటు సిమ్ కార్డులు, డెయిలీ 2 జీబీ డేటా కల్పించారు. వీడియో క్లాసులు వినేందుకు, డిజిటల్ పుస్తకాలు చదివేందుకు, ఆన్‌లైన్ అసైన్‌మెంట్ చేసేందుకు ఆ ట్యాబ్లెట్లను ఇచ్చారు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినా.. వైఫై, సిమ్ కార్డులు లేకపోవడం వల్ల విద్యార్థులకు ట్యాబ్లెట్లు ఉపయుక్తంగా లేవన్నారు. కర్నాల్ జిల్లాలో 32 వేల ట్యాబ్లెట్లను పంచారు. దాంట్లో ప్రస్తుతం 23 వేలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇక కథియాల్ జిల్లాలో 27వేల ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. వీటిల్లో కేవలం 20 వేలు మాత్రమే ఫంక్షనల్‌గా ఉన్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం వల్ల డిజిటల్ ట్యాబ్లెట్లు నిరుపయోగంగా ఉంటున్నట్లు టీచర్లు ఆరోపించారు.

# ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం... ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు

**రాయపూర్ –04 ఫిబ్రవరి (మహాప్రభ)**
ప్రియుడు తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడిని అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేసింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బిలాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల కమ్తా ప్రసాద్ సూర్య వంశీ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి హోటల్‌కు దగ్గరలో ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో 22 ఏళ్ల రోషిణి సూర్యవంశీతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కలిసి తిరిగే వారు.. ఫోన్‌లో గంటలు, గంటలు మాట్లాడుకునే వారు. అయితే, గత మూడు రోజుల నుంచి ప్రసాద్ వింతగా ప్రవర్తించటం మొదలెట్టాడు. రోషిణి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో రోషిణి తీవ్ర




ఆగ్రహానికి గురైంది. అతడు వేరే అమ్మాయితో తిరుగుతున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం కత్తి తీసుకుని ప్రసాద్ ఉండే ఇంటి దగ్గరకు వెళ్లింది. ప్రసాద్ తలుపు తెరవగానే అతడి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడు ఇందుకు ఒప్పుకోలేదు. ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. కట్టలు తెంచుకున్న కోపంతో రోషిణి ప్రసాద్‌పై కత్తితో దాడి చేసింది. నేరుగా అతడి గుండెపై పొడిచింది. ప్రసాద్ గట్టిగా అరవటంతో లోపల ఉన్న ఫ్రెండ్ బయటకు వచ్చాడు. ప్రసాద్ నేలపై రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. ఆ ఫ్రెండ్ వెంటనే ప్రసాద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.నిందితురాలు రోషిణిని అరెస్ట్ చేశారు. పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'ఆ యువతి మృతుడి ఇంటికి వచ్చింది. అతడి ఫోన్ ఇవ్వమని డిమాండ్ చేసింది. గొడవ సందర్భంగా కత్తితో అతడి గుండెపై పొడిచింది. అతడు అక్కడికక్కడే చనిపోయాడు' అని తెలిపారు. కాగా, బీజేపీ నాయకుడు, జిల్లా పంచాయత్ ప్రెసిడెంట్ రాజేష్ సూర్యవంశీకి ప్రసాద్ మేనల్లుడని తెలుస్తోంది.

# నువ్వు ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా?

- రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్.
- గెలిచే దమ్ములేక మా అభ్యర్థులను ఎత్తుకెళ్తున్నారు.. వడ్డీతో సహా చెల్లిస్తాం గుర్తుపెట్టుకోండి.
- తెలంగాణ కోసం పదవులులేదని కాదు.. ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్.

**మెదక్ జిల్లా–04ఫిబ్రవరి (మహాప్రభ)**
కాంగ్రెస్ పార్టీకి గెలిచే దమ్ములేక, ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించి, ప్రలోభపెట్టి పార్టీలు మారుస్తున్నారని మాజీ మంత్రి, హరీష్ రావు మండిపడ్డారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషపై, పాలనపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. హరీష్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా? అని అడుగుతున్నా. అవ్వతాతలు రూ. 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అని అడిగితే లాగుల తొండలు వదులుతా అంటావా.బాండ్ పేపర్లు రాసిచ్చి, అమ్మతోడు అని చెప్పి మోసం చేశావు కదా.. ఆడబిడ్డలు మహాలక్ష్మి రూ. 2500 అడిగితే 'పేగులు తీసి మెడలో వేసుకుంటా' అంటావా? ఇదేనా నీ సంస్కారం? నీ రౌడీయిజం సాగదు ఖబర్దార్.తెలంగాణ కోసం డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రి పదవులను గడ్డిపోచల్లా విసిరేసిన మహనీయుడు కేసీఆర్. అని



అన్నారు. కె సిఆర్ చెబితే మేము కూడా పదవులకు రాజీనామా చేసి ఆంధ్రా పాలకుల ముఖం మీద కొట్టినం. మరి నువ్వు? రాజీనామా చేయమంటే జిరాక్స్ పేపర్ పంపిన దొంగవు. తెలంగాణ ఉద్యమకారుల మీద తుపాకీ గురిపెట్టిన ద్రోహివని అన్నారు. కేసీఆర్ ప్రాణ త్యాగానికి సిద్ధపడి తెలంగాణ తెచ్చారు కాబట్టే నువ్వు ఈరోజు సీఎం కుర్చీలో ఉన్నావు. లేకపోతే ఆంధ్రాలో మోచేతి నీళు తాగుతూ, బ్యాగులు మోసుకుంటూ బతికేవాడివి. కాంగ్రెస్ పార్టీకి గెలిచే సత్తా ఉంటే మా అభ్యర్థులను ఎందుకు ఎత్తుకెళ్తున్నారు? జనం మీకు ఓటు వేయరని అర్థమై.. పోలీసులతో బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి కండువాలు కప్పుతున్నారు. ఎవరెవరు అమ్ముడుపోతున్నారో, ఎవరు ఎందుకు ఎత్తుకుపోతున్నారో అందరినీ గుర్తుపెట్టుకుంటాం. సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం. ఇప్పటివరకు రైతు బంధు ఇవ్వలేదు. ఫిబ్రవరి 11వ తేదీలోగా రైతు బంధు పడకపోతే.. రైతులు నీ చెడ్డీల తొండలు తొడిగి ఏడిపిస్తారు. నిన్ను చీరిచింతకు చెండాడుతారని,రుణమాఫీ పేరుతో దేవుళ్లనే మోసం చేసిన ఘనుడివి నువ్వు. నీ అబద్ధాలను రైతులు నమ్మే స్థితిలో లేరని మెదక్ జిల్లా కల నెరవేర్చింది కేసీఆర్. ఇక్కడికి కలెక్టర్ ఆఫీసు, ఎస్పీ ఆఫీసు, రైలు, నాలుగు లైన్ల రోడ్డు తెచ్చింది కేసీఆర్ అని ఘనపూర్ ఆయకట్టుకు నీళ్లు ఇచ్చింది మేము. సిద్దిపేటతో సమానంగా మెదక్‌ను అభివృద్ధి చేశామని కాంగ్రెస్ వచ్చాక ఇక్కడ ఒక్క రూపాయి పని జరగలేదన్నారు. మెదక్‌లో ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని ఏ కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా మీకు మీ హరీష్ అన్న ఉన్నాడు.. నేను చూసుకుంటా. కాంగ్రెస్ గుండా రాజకీయాన్ని, మోసాలను ఎండగట్టండని తెలిపారు. బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చారు. కాబట్టి కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి. మెదక్ అభివృద్ధిని కొనసాగిద్దాం. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు తిరుపతి రెడ్డి, మాజీ చైర్మన్లు మాజీ కౌన్సిలర్లు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న అభ్యర్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఎం పియుపిఎస్ పంగిడిపల్లిలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

క్యాన్సర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి.
పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కురిమిళ్ళ సారయ్య

**కమలాపూర్–04 ఫిబ్రవరి (మహాప్రభ)**
ఎంపియుపిఎస్ పంగిడిపల్లి పాఠశాల యందు పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కురిమిళ్ల సారయ్య ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం జరిగింది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న జరుపుకునే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం. ఈ




సందర్భంగా క్యాన్సర్, దాని కారణాలు మరియు వ్యక్తులు మరియు సమాజాలపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడానికి ఒక ప్రపంచ చొరవ. ఈ రోజు లక్ష్యం అని ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కురిమిళ్ళ సారయ్య మరియు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు అలిగిరెడ్డి రాజేందర్ రెడ్డి, వేషాల వెంకట రాజం, కందికొండ శంకర్, మాలోత్ అఖిల్ సాయి మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

**-దుబ్బాక మున్సిపల్ లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు ఖాయం**
**-16వ వార్డు మేనిఫెస్టో విడుదల చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి**



**దుబ్బాక - ఫిబ్రవరి 04( మహా ప్రభ)** దుబ్బాక మున్సిపల్ లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు ఖాయమని పార్టీ బలపరిచిన అభ్యర్థులను వార్డు ప్రజలు గెలిపించాలని దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 16 వార్డుకి సంబంధించిన ఎన్నికల మేనిఫెస్టో ను పిఎసిఎస్ డైరెక్టర్ గజబింకర్ బాలరాజు, మహిళా అధ్యక్షురాలు ఆలేటి సరోజన 14 అవార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తునికి సురేష్ లతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అధికారంలో మన ప్రభుత్వమే ఉందని పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే దుబ్బాక మున్సిపాలిటీ మరింత అభివృద్ధి అవుతుందన్నారు. అనంతరం 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మత్స్య శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకులు మున్సిపల్ అభివృద్ధిని పట్టించుకోలేదని తనను గెలిపిస్తే 16వ వార్డుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. వార్డు నెలకొన్న సమస్యల పరిష్కారం కొరకు పని చేస్తానన్నారు. తనను గెలిపిస్తే వార్డు ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా 20 రకాల సమస్యలను తూచా తప్పకుండా పరిష్కారం వార్డు అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# రేపటి బిజెపి ఎన్నికల శంకర వరం సభను విజయవంతం చేయండి

**- ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు**




**దుబ్బాక - ఫిబ్రవరి 04 (మహా ప్రభ )** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరాడమే లక్ష్యంగా 20వ వార్డులో బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం రేపు సాయంత్రం 5:00 గంటలకు దుబ్బాక పట్టణంలో స్థానిక " పోచమ్మ గుడి" వద్ద జరిగే బిజెపి ఎన్నికల శంకర వరసభ" ను విజయవంతం చేయగలరు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రివర్యులు జి,కిషన్ రెడ్డి గారు మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారు హాజరవుతున్నందున, 20 వార్డులో బిజెపి శ్రేణులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయగలరు కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ సర్కార్ నుండి తీసుకువచ్చే నిధులతో దుబ్బాక మునిసిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనుకుంటే బిజెపి కౌన్సిలర్ అభ్యర్థులను 20 వార్డులో గెలిపించాలని కోరుతున్నా గత ఐదు సంవత్సరాలుగా సమస్యల వలయంగా ఉన్న దుబ్బాక మున్సిపాలిటీని, అభివృద్ధిలో ముందుకు తీసుకుపోవడంతో పాటు, అవినీతి లేని దుబ్బాక మున్సిపాలిటీ కావాలంటే అది కేవలం బిజెపితోనే సాధ్యమవుతుందని, దుబ్బాక మున్సిపాలిటీలో అవినీతి అంత బీజేపీ పంతంగా" నేడు 20 వార్డులలో బిజెపి విజయ దంక మోగించబోతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం.

# రామకోటి సంస్థకు 3 క్వింటాళ్ల గోటి తలంబ్రాలు (వడ్లు) అందజేత

- భద్రాచలంలో రామకోటి రామరాజుకు ఘన సన్మానం
-తెలంగాణ రాష్ట్రం నుండి 4వ సారి రామకోటి సంస్థ కు అవకాశం
- రామకోటి రామరాజును భక్త రామదాసుగా కీర్తించాము
--భద్రాచల దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్



**దుబ్బాక - ఫిబ్రవరి 04 (మహా ప్రభ)** భద్రాచలంలో సీతారాముల కళ్యాణం లో గోటితో కొలిచిన వడ్లనే వాడటశీ ఆనవాయితీ యంత్రాలను వాడారు. ఈ గోటి తలంబ్రాలు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దిపేట జిల్లా గజ్వేల్లి పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థకు 4వ సారీ చోటు కల్పించారు. బుధవారం నాడు 3 క్వింటాళ్ల వడ్లకు ప్రత్యేక పూజలు జరిపి రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. భద్రాచల దేవస్థానం ఏఈఓ శ్రావణ్ కుమార్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపార రామదాసుగా రామకోటి రామరాజును, గతంలోనే కీర్తించామన్నారు. గత 30 సంవత్సరాల నుండి రామ నామాన్ని ప్రతి భక్తునిచే కొట్లాడి పెద్ద సంఖ్యలో రామ నామాలను లికింపజేయడంలో కృషి, పట్టుదల ఆమోగం అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ గ్రామాన తిరిగి లక్షల మంది భక్తులచే రామనామ స్మరణ చేయించి గోటితో వడ్లను ఒలిపించి భక్తితో మూడుసార్లు కళ్యాణానికి అందించారన్నారు. గూటి తలంబ్రాలు అందజేసే బృహత్తర కార్యక్రమం చేపట్టి పలువురుకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం రామకోటి రామరాజు మాట్లాడుతూ గోటి తలంబ్రాలు కార్యక్రమంలో మమ్మల్ని బాగా స్వాములుగా చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ భక్తుల కోరిక మేరకు త్వరలోనే కోటి తలంబ్రాల దీక్షకు శ్రీకారం చుట్టబోతున్నమన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట హోలీ క్రాస్ జంక్షన్ వద్ద మరో ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి




**ఫిబ్రవరి 4 (సూళ్లూరుపేట) మహాప్రభ.** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట హోలీ క్రాస్ జంక్షన్ వద్ద మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి చెన్నై కి వెళ్తున్న కంటైనర్ లారీ, బైకును ఢీకొనడంతో బైక్ లో ప్రయాణించి వస్తున్న మహిళ అక్కడ కక్కడే మృతి చెందగా యుక్త వయసు గల అబ్బాయిని హాస్పిటల్కు తరలించగా మార్గము మధ్యలో మృతి చెందాడు. రెండు కుటుంబాలలో అంతులేని విషాదం అలుముకున్నది స్థానిక వివరాల ప్రకారం ఇద్దరూ శ్రీ సిటీ లోని సి ఈ టి సి పరిశ్రమంలో రాత్రి విధులు నిర్వహించుకుని బైక్ లో సూళ్లూరుపేటకు వస్తుండ చెన్నై, తిరువల్లూరు జిల్లా ఆరని ప్రాంతానికి చెందిన ఎల్లా చిట్టిబాబు కుమారుడు ఎల్లా రాజశేఖర్ 33 అదే కంపెనీలో పనిచేస్తున్న సూళ్లూరుపేట పట్టణములోని గౌండ్ల వీధికి చెందిన గోపిశెట్టి సుధాకర్ భార్య గోపిశెట్టి శ్రావణి 34 బైక్ లో వెనుక కూర్చుండగా వెనుక నుండి టి ఎన్ 05 సి జెడ్ 5972 నెంబరు గల కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. మహిళ అక్కడ మృతి చెందింది కొన ఊపిరిలో ఉన్న రాజశేఖర్ ను హాస్పిటలకు తరలించగా మార్గం మధ్యలో మృతి చెందాడు. హైవే మీద రక్తపు మడుగులో చల్లాచెదురుగా పడిపోయారు. వారిని తీసేసిన వెంటనే ఫైర్ ఇంజన్ నీటితో వారి రక్తాన్ని కడగాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఎంత ఘోరమైన యాక్సిడెంట్ తెలుస్తుంది. ఘటన స్థలానికి చేరుకున్న సూళ్లూరుపేట సబ్ఇన్స్పెక్టర్ బ్రహ్మానాయుడు విచారణ చేపట్టారు. ఈ హోలీ క్రాస్ జంక్షన్కు ఇరువైపులా హైవే రోడ్డు మీద 20 మీటర్ల దూరంలో స్పీడ్ కంట్రోల్ బోర్డ్ 20 ఖవీ అని పెట్టి హై స్పీడ్ తగ్గించి ఈ ప్రమాదాలను నివారించాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుచున్నారు.

# మెదక్‌లో ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన.



**మెదక్ జిల్లా-04ఫిబ్రవరి (మహాప్రభ)** మెదక్ జిల్లాలో ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం రూ.65 వేల కోట్లను మింగిందని విమర్శించారు. ప్రజలకు మంచి భోజనం అందాలనే ఉద్దేశంతో సన్న బియ్యం అందిస్తున్నామని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మెదక్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీ ద్వారా స్థానిక విద్యార్థులు డాక్టర్లుగా మారాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థులు దొంతి నరేష్,దొంతి లక్ష్మిలను చేయి గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించామని చెప్పారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రేషన్ కార్డులు ఇచ్చిందన్నారు. ఇచ్చిన కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూసే ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో గత ప్రభుత్వం రైతు బంధు అమలు చేసిందన్నారు. గతంలో నియోజకవర్గానికి రూ.2000 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఏడుపాయల ప్రాంతానికి గతంలో ఏ సీఎం రాలేదని, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రూ.35 కోట్ల అభివృద్ధి నిధులు ఇచ్చారని చెప్పారు. మెదక్ చర్చికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, సీఎం రేవంత్ రెడ్డి రూ.29.30 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. వరదల సమయంలో ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని, బాధితులకు పరిహారం అందించిందన్నారు. సీఎం రేవంత్‌కు అభివృద్ధి చేయాలనే కసి ఉందని అన్నారు.

# సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ సభ్యులకు ఘన సన్మానం



**మానకొండూర్, -04 ఫిబ్రవరి (మహాప్రభ)** మైలారం సమ్మక్క--సారలమ్మ జాతర విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా జాతర కమిటీ చైర్మన్, సభ్యులను బీజేపీ మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ లైన్ మేన్ శ్రీకాంత్, లైటింగ్ సహకారం అందించిన మడికంటి స్వామి, గ్రామ సిబ్బందిని కూడా సన్మానించారు.కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ విలసాగరం రామచంద్రం, సమ్మక్క పూజారి బుర్ర రాములు, సారలమ్మ పూజారి తోట రాజేశం, మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ వరాల పర్శరాములు, దుడ్డు మల్లేశం, గాలిపల్లి శంకర్, తోట పవన్, వరాల మల్లేశం తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

**అచ్చంపేట, -04 ఫిబ్రవరి (మహాప్రభ)** నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని 19వ వార్డు కొత్త బస్టాండ్ దగ్గర జరుగుతున్న బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి కాంట్రాక్టర్లను కోరారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న బ్రిడ్జిని పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక వైస్ చైర్మన్ శైలజ విష్ణువర్ధన్ రెడ్డి, ఐఎన్టీయూసీ తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యం

- వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్,-04 ఫిబ్రవరి (మహాప్రభ)**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు, తొమ్మిదో డివిజన్ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి పడిశెట్టి వసంతలక్ష్మిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బుధవారం కోతి రాంపూర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యమవుతుందని, టీఆర్ఎస్, బీజేపీతో సాధ్యం కాదని పేర్కొన్నారు. వారికి ఓటు వేస్తే వృథా అవుతుందని, గల్లీ గల్లీలో పనులు చేయగలిగేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వివరించారు.ప్రజలంతా పడిశెట్టి వసంతలక్ష్మిని ఆశీర్వదించి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, మునిపల్లి ఫణిత, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సార్వత్రిక సమ్మెకు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు.బొమ్మకల్ గ్రామంలోని సిమెంట్ గోదాముల వద్ద సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షులు జంగము తిరుపతి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాన్ని నిలిపివేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సిమెంట్ హమాలి కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలి సంగం నాయకులు బాగోతం వీరయ్య, కొమురయ్య, శ్రీనివాస్, ఐలయ్య, రాములు గౌడ్, శ్రీనివాస్ కొమురయ్యతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

# అక్కన్నపేట గ్రామ అభివృద్ధి పనులకు నాంది



**హుస్నాబాద్, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
అక్కన్నపేట మండలం మైసమ్మ వాగు గ్రామ పంచాయతీ పరిధిలో బోరు మోటార్ పైప్‌లైన్ ద్వారా పంచపాండవుల గుట్ట, ఐకేపీ సెంటర్‌కు విద్యుత్ కనెక్షన్ అందించారు. ఈ కార్యక్రమం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిధులతో అమలైంది.గ్రామ ప్రజల తరఫున మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి కార్యక్రమాలు చేరేలా కేంద్రమంత్రి బండి సంజయ్ కృతనిశ్చయంతో నిధులు కేటాయిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రబాహరి విజయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కర్ణకంటి నరేష్, మాజీ సర్పంచ్ సందవేనా కుమార్, గ్రామ ఉపసర్పంచ్ రాజేందర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, మడక రవికుమార్, బీజేపీ సీనియర్ నాయకులు మోహన్ నాయక్, సాంకే సంతోష్, మేకల బాపూరావు, వంగపల్లి సాగర్, గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు నీరు, విద్యుత్ సౌకర్యాలు అందించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయం.

-మెదక్ లో బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం.
-బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి .



**మెదక్ జిల్లా-04 ఫిబ్రవరి (మహాప్రభ)**
గత ఎన్నికల్లో కాంగ్రెస్కు ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో ఆ తప్పిదం చేయకుండా బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మెదక్ మున్సిపల్ పరిధిలోని 1,2,3,4 వార్డులో అభ్యర్థులు చెప్యాల. రాజవ్వ సంజీవ్,ఎరుకల. ఎల్లయ్య,కొట్టాల.లలితమ్మ విశ్వం, ధర్మశెట్టి. స్వరూపలతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎరువులు సకాలంలో అందజేస్తూ ఇబ్బందులు లేకుండా చూసారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కోసం రైతులు బారులు తిరు తున్నారని చెప్పారు.మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి నీరు సరఫరా చేసి మహిళల ఇబ్బందులను తీర్చాలని గుర్తు చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్న పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆరోపించారు.కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు.కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను నేడు ప్రజలు గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేస్తామని అంటున్నారని వెల్లడించారు. ఏ ఇంటికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు రూ.2 వేల పింఛన్లు రూ.4 వేలు చేస్తానని ఇవ్వలేదని, ఇండ్లు ఇస్తామని ఇవ్వలేదని, స్కూటీలు రాలేదని, తులం బంగారం ఇవ్వలేదని, మహిళలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వలేదని,రూ.5 లక్షల విద్యా గ్యారెంటీ ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి రాలేదని ప్రజలు అంటున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి, ప్రజలను మోసం చేసి, మభ్యపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని తెలిపారు.ఎమ్మెల్యే సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నామని, అనాథలను ఆదుకుంటున్నామని ప్రచారం చేశారని , అభివృద్ధి ఎక్కడ జరిగింది, ఎవరిని ఆదుకున్నారని ప్రశ్నించారు. కేసులు పెడతామని భయభ్రాంతులకు కూడా చేస్తే ఇక్కడ భయపడే వారు ఎవరు లేరని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కొట్టాల. విశ్వం,భీమారి. కిషోర్,వార్డ్ ఇంచార్జిలు హవేళిఘనాపూర్ సర్పంచ్ మ్యాకల.సాయిలు,ఉప్ప సర్పంచ్ వడ్ల రాజు,వార్డు ఇంచార్జుసుదర్శన్,రవీందర్, మోహన్ నాయక్,నాగరాజు, రామచంద్ర రెడ్డి శ్రీహరి,పట్టణ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చేసిచూపుతాం.





## మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి.

**మెదక్ జిల్లా-04ఫిబ్రవరి (మహాప్రభ).**
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే మెదకు అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామని జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మెదక్, రామయంపేట పట్టణంలోని కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం పదేళ్లపాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం రూ.65 వేల కోట్లను మింగిందని విమర్శించారు. ప్రజలకు మంచి భోజనం అందాలనే ఉద్దేశంతో సన్న బియ్యం అందిస్తున్నామని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మెదక్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీ ద్వారా స్థానిక విద్యార్థులు డాక్టర్లుగా మారాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థులు నరేష్, లక్ష్మిలను చేయి గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించామని చెప్పారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రేషన్ కార్డులు ఇచ్చిందన్నారు. ఇచ్చిన కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూసే ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో గత ప్రభుత్వం రైతు బంధు అమలు చేసిందన్నారు. గతంలో నియోజకవర్గానికి రూ.2000 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ఏడుపాయల ప్రాంతానికి గతంలో ఏ సీఎం రాలేదని, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రూ.35 కోట్ల అభివృద్ధి నిధులు ఇచ్చారని చెప్పారు. మెదక్ చర్చికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, సీఎం రేవంత్ రెడ్డి రూ.29.30 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. వరదల సమయంలో ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని, బాధితులకు పరిహారం అందించిందన్నారు. సీఎం రేవంత్‌కు అభివృద్ధి చేయాలనే కసి ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పట్టణాల అభివృద్ధి చెందాలంటే కేవలం కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమైన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# విధ్యానగర్ కాలనీ తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్



**ఆమనగల్లు, -04 ఫిబ్రవరి (మహాప్రభ)**
విధ్యానగర్ కాలనీకి స్థానిక ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను లేఖ రూపంలో సిద్ధం చేసి వినతిపత్రంగా అందజేశారు.ప్రధానంగా తాగునీటి సమస్యను ప్రస్తావిస్తూ, కృష్ణా నీటిని అందించి శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. ఇళ్ల మధ్యగా వెళు న్న ప్రమాదకర విద్యుత్ లైన్లు, వీధి దీపాల లేమి, సీసీ రోడ్లు లేకపోవడం, అంతర్గత మురుగు కాలువలు లేకపోవడం, కరెంట్ ఫ్లక్చుయేషన్, వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వంటి సమస్యలను వివరించారు. ప్రజల భద్రత కోసం హైమాక్స్ లైట్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పాషా, యూత్ ప్రెసిడెంట్ ఉదయ్, జంగయ్య, వంశీ, శర్మ, దొరబాబు, భూమినాథన్, శ్రీను, కమల, ప్రేమలత, ధోళి తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# మన దేశంలో అత్యధిక బంగారు నిల్వలు ఉన్న రాష్ట్రం ఏదో తెలుసా?

## 90 శాతం అక్కడి నుంచే..




ఈ రోజుల్లో బంగారం చాలా ఖరీదైనదిగా మారింది. ధర రోజురోజుకూ పెరుగుతోంది. భారతదేశంలో బంగారం ఆభరణాల రూపంలోనే కాదు, పెట్టుబడి మార్గంగా కూడా మారింది. అయితే బంగారానికి ఇంత డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అసలు ఏ రాష్ట్రంలో ఎక్కువ బంగారం ఉందో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. బంగారు తవ్వకం, ఉత్పత్తి విషయానికి వస్తే కర్ణాటక రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో ఉంది. దేశంలో తవ్విన మొత్తం బంగారంలో 99 శాతం కర్ణాటక గనుల నుండే వస్తుంది. రాయచూర్ జిల్లాలోని హుట్టి బంగారు గనులు దేశంలోని పురాతనమైన, అత్యంత చురుకైన గనులలో ఒకటి. కర్ణాటకలోని కోలార్ బంగారు క్షేత్రం బంగారు ఉత్పత్తి పరంగా కూడా అత్యంత ప్రసిద్ధ గని. బంగారం ఉత్పత్తిలో కర్ణాటక అగ్రగామి రాష్ట్రం. కానీ అత్యధిక బంగారు నిల్వలు బీహార్ రాష్ట్రంలో ఉన్నాయి. బీహార్‌లోని, జిల్లాలో అత్యధిక బంగారు నిల్వలు ఉన్నాయని పరిశోధనలో వెల్లడైంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం జముయ్ జిల్లాలో వేల టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయి. ఇక్కడ ఇంకా పెద్ద ఎత్తున మైనింగ్ ప్రారంభం కాలేదు. భారతదేశంలోని చాలా బంగారు గనులు భూగర్భంలో ఉన్నాయి. ఈ బంగారాన్ని నేలను తవ్వడం ద్వారా తీస్తారు.

## భెల్‌కు మరో భారీ ఆర్డర్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:
విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భెల్ మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. హిందాల్కో ఇండస్ట్రీస్ నుంచి రూ.1,200–1,500 కోట్ల లోపు ఆర్డర్ లభించినట్టు వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య లెటర్ ఆఫ్ ఇంటెంట్ జరిగినట్టు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది.ఈ ఆర్డర్‌లో భాగంగా 150 మెగావాట్ల రెండు బీటీజీ ప్రాజెక్టుల్లో భాగంగా డిజైనింగ్, ఇంజినీరింగ్, తయారీ, సరఫరా చేయాల్సివుంటుందని పేర్కొంది. ఒడిశాలోని సంబల్‌పూర్ వద్ద హిందాల్కో నిర్మించతలపెట్టిన ఈ విద్యుత్ ప్రాజెక్టును వచ్చే మూడేండ్లలో నిర్మించనున్నది.

## ఎయిర్‌టెల్ ప్లాన్లపై అన్‌లిమిటెడ్ డాటా

న్యూఢిల్లీ,
ఎయిర్‌టెల్ పలు ఎంపిక చేసిన ప్రీపెయిడ్ ప్లాన్లపై అన్‌లిమిటెడ్ డాటాను ఆఫర్ చేస్తున్నది. అయితే రూ.399, రూ.449 ప్లాన్లకు మాత్రమే ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. 28 రోజుల కాలపరిమితితో రూ.399 ప్లాన్‌పై అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ 4జీ/5జీ డాటా లభించనున్నది.అలాగే రూ.449 ప్లాన్‌లోనూ 28 రోజులతోపాటు అదనంగా 300 జీబీ డాటా లిమిట్‌గా ఉండేది. ఈ ప్లాన్‌లో గూగుల్ వన్, యాపి ల్ మ్యూచిజ్‌ను 6 నెలల పాటు, సోనీఎల్ఐవీ, ఇతర ఓటీటీ యాప్స్‌ల్లో ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే, జియో హాట్‌స్టార్‌ను 28 రోజుల పాటు ఉచితంగా అందిస్తున్నది. తన పోటీ సంస్థయైన వొడాఫోన్ ఐడియా మాత్రం రూ.399 ప్లాన్లో అర్ధరాత్రి 12 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత డాటాను ఆఫర్ చేస్తున్నది.




# స్పోర్ట్స్


## అరోన్ జార్జి సెంచరీ..
## ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్.. ఆఫ్ఘన్‌పై ఘన విజయం



అండర్ 19 వరల్డ్ కప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆఫ్ఘనిస్తాన్‌పై బుధవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచులో భారత్ ఘన విజయం నమోదు చేసింది. అరోన్ జార్జి సెంచరీతో చెలరేగగా.. వైభవ్ సూర్యవంశీ దూకుడైన అర్ధసెంచరీతో భారీ విజయ లక్ష్యాన్ని ఇండియా సునాయాసంగా చేధించింది. హరారే వేదికగా జరిగిన మ్యాచులో మొదట ఆఫ్ఘనిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 310 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ బ్యాటర్లలో ఇద్దరు సెంచరీలు సాధించారు. ఫైజల్ షినోజోదా 110 పరుగులు (93 బంతుల్లో 15 ఫోర్లు), ఉజైరుల్లా 101 పరుగులు, నాటౌట్ (86 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు)తో ఆకట్టుకున్నారు. తర్వాత ఉస్మాన్ సాదత్ 39 పరుగులు, ఖలీద్ అహ్మద్జాయ్ 31 పరుగులు సాధించారు. ఇండియన్ బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం 311 పరుగుల భారీ లక్ష్యంతో భారత్ బ్యాటింగ్ ఆరంభించింది. ఓపెనర్ అరోన్ జార్జ్ 115 పరుగులు (104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు)తో చెలరేగిపోయాడు. తర్వాత వైభవ్ సూర్యవంశీ 62 పరుగులు (33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు)తో విధ్వంసం సృష్టించాడు.ఆ తర్వాత కెప్టెన్ ఆయుష్ మాత్రే కూడా 62 పరుగులు (59 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లు)తో అదరగొట్టాడు. అలాగే విహాన్ మల్హోత్రా కూడా 38 పరుగులతో రాణించారు. భారత బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో 41.1 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ నెల 6, శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇండియా, ఇంగ్లండ్ మధ్య ఈ తుదిపోరు ఉంటుంది

## పాట్ కమిన్స్ ఐపీఎల్ కి దూరమయ్యే చాన్స్!

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ (అభిమానులకు మింగుడుపడని వార్త అందుతోంది. జట్టును ముందుండి నడిపించే కెప్టెన్, ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ పాట్ కమిన్స్ ఈ మెగా టోర్నీకి దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వెన్నునొప్పి సమస్య తలెత్తడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మార్చి 26 నుంచి ఐపీఎల్ సీజన్-19 ప్రారంభం కానుంది. అయితే, అంతకంటే ముందే హైదరాబాద్ ఫ్రాంచైజీ కెప్టెన్ ఇబ్బందుల్లో పడటం ఫ్యాన్స్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం క్రికెట్ ప్రపంచమంతా టీ20 ప్రపంచకప్ 2026 కోసం సిద్ధమవుతోంది. అయితే, వెన్నునొప్పి కారణంగా కమిన్స్ ఇప్పటికే ఈ మెగా ఈవెంట్‌కు దూరమయ్యాడు. ప్రపంచకప్ ముగిసిన వెంటనే ఐపీఎల్ ప్రారంభం కానుండటంతో, అప్పటికి ఆయన కోలుకుంటాడా లేదా అన్నది సందేహంగా మారింది.



తను ఐపీఎల్ ఆడటంపై పాట్ కమిన్స్ స్వయంగా క్లారిటీ ఇచ్చారు. “ప్రస్తుతానికి నేను ఏమీ చెప్పలేను. త్వరలో మరోసారి స్కాన్ చేయించుకోవాలి. నా వెన్నెముక ఎంత వేగంగా కోలుకుంటుందనే దానిపైనే ఐపీఎల్‌లో నా భాగస్వామ్యం ఆధారపడి ఉంటుంది. పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే మైదానంలోకి దిగుతాను” అని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియా బోర్డు నిబంధనల ప్రకారం.. సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ప్లేయర్లు పూర్తి ఫిట్‌గా ఉంటేనే విదేశీ లీగ్‌లలో ఆడేందుకు అనుమతిస్తారు. మార్చి నెలాఖరు నాటికి కమిన్స్ ఫిట్‌నెస్ సాధించకపోతే, క్రికెట్ ఆస్ట్రేలియా అతన్ని భారత్‌కు పంపే అవకాశం లేదు. ఒకవేళ కమిన్స్ దూరం అయితే, హైదరాబాద్ జట్టు కొత్త కెప్టెన్‌ను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తి జట్టు :
పాట్ కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్, లియామ్ లివింగ్‌స్టోన్, జైదేవ్ ఉనద్కత్, భువనేశ్వర్ కుమార్, కమిందు మెండిస్, బ్రైడన్ కార్సే తదితరులు.

## అమ్మో అది మనవల్ల కాదులే..

### క్రికెట్ కామెంట్రీ గురించి దోని ఆసక్తికర వ్యాఖ్యలు




క్రికెట్ కామెంట్రీ గురించి టీమిండియా మాజీ కెప్టెన్ ఎమ్మెస్ దోని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. క్రికెట్ కామెంట్రి అనేది ఒ కళ అని అన్నాడు. కామెంటేటర్‌గా చేయాలంటే చాలా టాలెంట్ ఉండాలన్నాడు. క్రికెట్ గురించి అందులో నెంబర్స్ గురించి పూర్తిగా తెలుసుండాలి సమయానికి అన్నీ గుర్తుండాలి. ఎంతో చమత్కారంగా, ప్రెక్షలను ఆకట్టుకునే విధంగా లైవ్ కామెంట్రీ చెప్పడం చాలా కష్టం. అది అందరికీ సాధ్యం కాదన్నారు. మొబైల్ ఫోన్‌లోనే ఇతరులతో మాట్లాడాలంటే నేను ఎంతో ఇబ్బంది పడతాను అలాంటిది కామెంట్రీ చెప్పడమా?.. అది మనవల్ల కాని పనిలే అని కామెంట్రీ గురించి అన్నాడు.క్రికెట్ మ్యాచ్ లైవ్‌లో ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా కామెంట్రీని ఎంతో ఆసక్తికరంగా చెప్పడం ఓ కళ అని ధోని పేర్కొన్నాడు. ప్లేయర్స్ భారీ షాట్స్ కొట్టినపుడు, గెలుపోటములు విశ్లేషించేటపుడు ఎవరూ నొచ్చుకోకుండా రన్నింగ్ కామెంట్రీ చెప్పడం చాలా కష్టమని, క్రికెట్ ప్లేయర్స్ అందరీ రికార్డ్స్ మొదలు కొని పాత మ్యచ్‌ల గణంకాలు గుర్తు పెట్టుకోవాలి. ఇది అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. నా గణకాంలే నాకు గుర్తుకుండవు. అని ధోని అన్నాడు.

నమస్తే మహాప్రభ

# 'వారణాసి'పై రాజమౌళి ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

## అందుకే ఐమాక్స్ ఎంచుకున్నా..

మహేష్ బాబు హీరోగా దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'. రూ.1300 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాను పూర్తిస్థాయి IMAX (ఐమాక్స్) ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు రాజమౌళి ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ సినిమా చరిత్రలో ఒక చిత్రాన్ని పూర్తిగా ఐమాక్స్ కెమెరాలతో షూట్ చేయడం ఇదే తొలిసారి కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను వెల్లడించారు జక్కన్న.రాజమౌళి మాట్లాడుతూ.. 'వారణాసి' కథా నేపథ్యం అత్యంత భారీ స్కేల్‌లో ఉంటుంది. అంటార్కిటికాలోని గడ్డకట్టే మంచు కొండల మధ్య జరిగే సాహసాలు, అలాగే రామాయణ కాలానికి సంబంధించిన అత్యంత వైవిధ్యమైన, అద్భుతమైన విజువల్స్‌ను వెండితెరపై ఆవిష్కరించడానికి సాధారణ కెమెరాలు సరిపోవు. ఈ కథలోని గ్రాండియర్‌ను, ఆ లోతైన ఎమోషన్స్‌ను ప్రేక్షకులు థియేటర్లలో కూర్చుని స్వయంగా అనుభవించాలంటే ఐమాక్స్ స్క్రీన్ మాత్రమే సరైన వేదికని నా నమ్మకం. సాధారణంగా వైడ్ స్క్రీన్ సినిమాల కంటే ఐమాక్స్ ఫార్మాట్ 26% ఎక్కువ విజువల్ ఏరియాను కవర్ చేస్తుంది. దీనివల్ల ప్రతి ఫ్రేమ్ అత్యంత స్పష్టంగా, భారీగా కనిపిస్తుంది. మహేష్ బాబును అడ్వెంచర్ హీరోగా ఇంతటి భారీ ఫార్మాట్‌లో చూడటం అభిమానులకు కనువిందు చేయడమే కాకుండా, భారతీయ సినిమా సాంకేతిక ప్రమాణాలను ప్రపంచస్థాయికి తీసుకెళ్తుందని జక్కన్న ధీమా వ్యక్తం చేశారు.






## తగ్గేదేలే అంటున్న దీపికా పదుకొనే..



# చిరంజీవి సినిమాలో 'ధురంధర్' హీరోయిన్

మన శంకర వర ప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

# బోర్డర్-2 నుంచి ఘర్ కబ్ ఆవోగే సాంగ్ విడుదల




బాలీవుడ్ క్లాసిక్ వార్ డ్రామా 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'బోర్డర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని సాధించి సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాలోని ఎమోషనల్ సాంగ్ 'ఘర్ కబ్ ఆవోగే పూర్తి స్థాయి వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. 1997 నాటి ఐకానిక్ పాటను పునర్నిర్మించిన ఈ వెర్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పాటను ఒరిజినల్ గాయకులు సోనూ నిగమ్, రూప్ కుమార్ రాథోడ్‌లతో కలిసి నేటి తరం గాయకులు అర్జిత్ సింగ్, విశాల్ మిశ్రా, దిల్జీత్ దోసాంజ్ అద్భుతంగా ఆలపించారు. అను మాలిక్ స్వరపరిచిన ఒరిజినల్ ట్యూన్‌కు సంగీత దర్శకుడు మిథూన్ సరికొత్త హంగులు అద్దారు. దాదాపు 10 నిమిషాల నిడివి గల ఈ వీడియో సాంగ్‌లో సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్ మరియు అహన్ శెట్టి సైనికుల భావోద్వేగాలను, వారి త్యాగాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. 1971 భారత్-పాక్ యుద్ధ నేపథ్యంలో అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 23, 2026న విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# బ్రేకప్ గురించి రివీల్ చేసిన హీరోయిన్

బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్, కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మధ్య రిలేషన్ షిప్ అంటూ కొన్ని రోజులుగా వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ పుకార్లపై మృణాల్ అనేకసార్లు వివరణ ఇచ్చినా, వాటికి బ్రేక్ పడకపోవడంతో తాజాగా షాకింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ధనుష్ తనకు మంచి స్నేహితుడు మాత్రమే కాదు, సోదరుడిలాంటి వాడు అని మృణాల్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో వారిద్దరిపై వస్తున్న రూమర్లకు ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. తాజా ఇంటర్వ్యూలో తన లవ్ లైఫ్ గురించి కూడా మృణాల్ మాట్లాడారు. గతంలో తాను ఒక అబ్బాయితో రిలేషన్‌షిప్‌లో ఉన్నానని, అయితే తన నటనను అతను ఇష్టపడకపోవడంతో బ్రేకప్ చెప్పేశాడని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అతడిని తలుచుకుంటే జాలేస్తుందని ఆమె వెల్లడించారు.



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com